క్లుప్తంగా

వైభవంగా మాతమ్మ జాతర



మాతమ్మను దర్శించుకుంటున్న భక్తులు

బంగారుపాళెం: మండలంలోని కుప్పాళ్లపల్లెలో బుధవారం మాతమ్మజాతర వైభవంగా నిర్వహించారు. జాతరలో భాగంగా మంగళవారం రాత్రి గెరిగ ఊరేగింపు నిర్వహించారు. బుధవారం ఉదయం అమ్మవారికి అంబళ్లు, పొంగళ్లను నైవేద్యంగా సమర్పించారు. అనంతరం అమ్మవారిని విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారికి పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త పల్లవి, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు కమ్మపల్లిలో ఫ్యామిలీ ఫిజీషియన్

చిత్తూరు రూరల్: చిత్తూరు మండలం కమ్మపల్లిలో గురువారం ఫ్యామిలీ ఫిజీషియన్ నిర్వహించనున్నట్లు బీఎన్ఆర్‌పేట వైద్యాధికారి భాస్కర్ తెలిపారు. ఉదయం 9.30 గంటలకు వైద్య సేవలు ప్రారంభమవుతాయన్నారు. ఈ వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

అయ్యప్ప స్వామి ఆలయంలో అన్నదానం



నగరి : పట్టణ పరిధి బైపాస్ కూడలి సమీపంగల శ్రీ ధర్మశాస్తా అయ్యప్ప స్వామి ఆలయంలో శుక్రవారం అయ్యప్ప స్వామి జన్మనక్షత్రమైన ఉత్తరా నక్షత్ర పూజలు వైభవంగా నిర్వహించారు. అయ్యప్ప పాటల భజనలు, అర్చన మంత్రాలను అధిక సంఖ్యలో అయ్యప్ప భక్తులు ఉచ్చరిస్తూ భజనలు చేయడంతో ఆలయ ప్రాంగణంలో పండగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా ఆలయంలో భక్తులకు అన్నదానం చేశారు. కన్నప్ప అనే భక్తులు అన్నదాన ఉభయదారుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో గురుస్వామి మురళి, భక్తులు మునస్వామి, రమేష్ బాబు, జయచంద్ర మేస్త్రీ, దుర్గాప్రకాష్ స్వామి, రవి తదితరులు పాల్గొన్నారు.

జనరిక్ మందులపై అవగాహన అవసరం

చిత్తూరు రూరల్: జనరిక్ మందులపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని బీఎన్ఆర్‌పేట ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి భాస్కర్ అన్నారు. చిత్తూరు మండలం బీఎన్ఆర్‌పేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం జనరిక్ మందుల వాడకంపై రోగులకు అవగాహన కల్పించారు. జనరిక్ మందుల వాడకం వల్ల ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండవన్నారు. నాణ్యతలో కూడా లోపాలు లేవన్నారు. ధర తక్కువగా ఉంటుందని, ఈ రకమైన మందులు చిత్తూరు నగరంలోని పలు చోట్ల ఉన్న జనరిక్ షాపుల్లో అందుబాటులో ఉన్నాయని ఆయన స్పష్టం చేశారు.

డివైడర్‌ను ఢీకొన్న కారు

పూతలపట్టు: మండలంలో రంగంపేట క్రాస్ వద్ద బుధవారం సాయంత్రం ఓ కారు రోడ్డు డివైడర్‌ను ఢీకొట్టింది. ఎస్ఐ హరిప్రసాద్ వివరాల మేరకు బెంగళూరుకు చెందిన దిలీప్ బుధవారం తిరుపతికి కారులో బయలుదేరాడు. మార్గమధ్యంలోని రంగంపేట క్రాస్ వద్ద ఆ కారు రోడ్డు డివైడర్‌ను ఢీకొంది. దీంతో దిలీప్‌కు తీవ్రగాయాలయ్యాయి. ఆయన్ను స్థానికులు ఆస్పత్రికి తరలించారు. దీనిపై వివరాలు సేకరిస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఇక రిజిస్ట్రేషన్లు పారదర్శకం

- చిత్తూరులో ప్రీమియం రిజిస్ట్రేషన్ సెంటర్
- పాస్‌పోర్టు సేవా కేంద్రాల తరహాలో సేవలు
- స్లాట్ విధానం, ఎనీవేర్ రిజిస్ట్రేషన్‌కు అవకాశం



చిత్తూరు కార్పొరేషన్: సాధారణంగా ఆస్తుల క్రయ విక్రయాల్లో రిజిస్ట్రేషన్ అనేది ఒక పెద్ద ప్రక్రియ. దీనికి తోడు కార్యాలయంలోని ప్రతి విభాగంలో అడుగడుగునా ఉద్యోగులు, రైటర్లు, మధ్యవర్తుల అవినీతికి అంతేలేదు. కొన్నేళ్లుగా వేళ్లూనుకుపోయిన ఈ అవినీతి విధానానికి చెక్ పెట్టడానికి ప్రయోగాత్మకంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. రాష్ట్ర వ్యాప్తంగా 9 జిల్లాల్లో పైలట్ ప్రాజెక్టుగా ప్రీమియం రిజిస్ట్రేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేసేందుకు సంకల్పించింది. అందులో భాగంగా చిత్తూరుకు ప్రీమియం సెంటర్ మంజూరు అయింది. వినియోగదారులకు సులభంగా అత్యాధునిక పద్ధతిలో సేవలు అందించేందుకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. పాస్‌పోర్టు సేవా కేంద్రాల తరహాలో కార్పొరేట్ స్థాయి హంగులతో పారదర్శక సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటోంది.

– రాష్ట్రంలో 9 ప్రీమియం రిజిస్ట్రేషన్ సెంటర్ల(పీఆర్సీ)ను ఏర్పాటు చేయాలని స్టాంప్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ ఆదేశాలు జారీచేసింది. ఇందులో విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, శ్రీకాకుళం, కాకినాడ, కర్నూలు, కడప, నెల్లూరు, తిరుపతినిను ఎంపిక చేశారు. తొలుత పైలట్ ప్రాజెక్టు కింద విశాఖపట్నం, శ్రీకాకుళం జిల్లాలో ప్రీమియం రిజిస్ట్రేషన్ సెంటర్లను ఏర్పాటు చేశారు. అక్కడ సేవలు విజయవంతం కావడంతో మిగిలిన విజయవాడ, గుంటూరు, కాకినాడ, నెల్లూరు, తిరుపతి ,కర్నూలు, కడప, చిత్తూరు జిల్లాలో ప్రీమియం రిజిస్ట్రేషన్ సెంటర్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖ అధికారులు చిత్తూరు నగరంలోని అనువైన ప్రాంతంలో 5–7 వేల చదరపు అడుగుల భవనం కోసం అన్వేషిస్తున్నారు. అన్నీ అనుకూలించినట్లయితే త్వరలోనే ప్రీమియం రిజిస్ట్రేషన్ సెంటర్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు.

అందించే సేవలు

పీఆర్సీల్లో ఫ్రంట్ ఎందరో అవుట్‌సోర్సింగ్ సిబ్బంది, డేటా ఎంట్రీ ఆపరేటర్లు ఉంటారు. గది చివరిలో సబ్‌రిజిస్ట్రార్, ఇతర సిబ్బంది ఉండి పనులు చేస్తారు. మొదట కొద్ది రోజులు ఆన్‌లైన్‌లో సేవలు అందించినా ఆ తర్వాత అన్నీ ఆఫ్‌లైన్ సేవలు ప్రజలకు అందుబాటులో ఉండేలా రూపకల్పన చేస్తున్నారు. ఇక్కడ ఏనీవేర్ రిజిస్ట్రేషన్ సదుపాయం అందుబాటులోకి రానుంది. వినియోగదారుడు మొదట తనకు అవసరమైన రోజును స్లాట్‌ద్వారా బుక్ చేసుకుంటాడు. ఇందుకోసం సెంటర్‌కు వెళ్లి సింగిల్ విండో కింద వినతి పత్రమిస్తే ఆన్‌లైన్‌లో సంబంధిత సేవా ప్రక్రియ మొదలవుతుంది. తర్వాత వినియోగదారులే తమ సమాచారాన్ని పబ్లిక్ డేటా ఎంట్రీ ద్వారా వివరాలను నమోదు చేసుకోవచ్చు. అప్పుడు ఆ సమాచారం ఆన్‌లైన్‌లోనే సబ్‌రిజిస్ట్రార్‌కు వెళుతుంది. అందులో పొరబాట్లు ఉంటే సబ్‌రిజిస్ట్రార్ వారికి తెలియజేసి సరిచేస్తారు. ఆ తర్వాత సబ్‌రిజిస్ట్రార్ వివరాలను పరిశీలించి ఆధార్ వెరిఫికేషన్ చేస్తారు. అనంతరం ఆస్తుల వివరాలను పరిశీలించి సక్రమంగా ఉంటే రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేస్తారు. దీంతో డాక్యుమెంట్ రైటర్లకు చెల్లించే అధిక భారం తగ్గుతుంది. ఈ విధానం విజయవంతం అయితే ఇక డాక్యుమెంట్ రైటర్ల ప్రమేయం ఏ మాత్రం ఉండదు. రిజిస్ట్రేషన్ అయిన వెంటనే ప్రక్రియ పూర్తయినట్లు మొబైల్‌ఫోన్‌కు మెసేజ్ వెళుతుంది. వారు నేరుగా వెళ్లి డాక్యుమెంట్‌ను తీసుకోవచ్చు. రిజిస్ట్రేషన్లు, మార్కెట్ విలువ, మదింపు, ఈసీలు, సీసీలు, స్టాంప్ అమ్మకాలన్నీ అక్కడే జరగనున్నాయి. స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజు సైతం ఇక్కడే డబ్బులు కట్టించుకొనే అవకాశం కల్పించారు. పదుల కొద్దీ స్టాంప్‌లు తీసి అతికించే పని లేకుండా ఫ్రాంకింగ్ మిషన్ ద్వారా డబ్బులు చెల్లించవచ్చు. ఇతర ఫీజులు సైతం ఆన్‌లైన్‌లో చెల్లించి రసీదు పొందవచ్చు. దీంతో గంటల తరబడి బ్యాంకులో నిలబడి వేచి చూసే పరిస్థితి ఉండదు. అదే విధంగా దళారులకు అధిక మొత్తంతో డబ్బులు ఇవ్వాల్సిన పని ఉండదు.

ప్రయోగాత్మకంగా అమలు



రిజిస్ట్రేషన్ శాఖలో అన్ని సేవలను ఒకే గొడుగు కింద తీసుకొస్తూ ప్రయోగాత్మకంగా ప్రీమియం సెంటర్ ద్వారా సేవలు అందివ్వనున్నారు. ఎలాంటి అవినీతికి తావులేకుండా రిజిస్ట్రేషన్ సేవలు పారదర్శకంగా అందించడమే ఈ సెంటర్ల ఉద్దేశం. వినియోగదారులకు ఎ టువంటి ఇబ్బందులు లేకుండా సులభంగా సేవ లు అందించనున్నాం. మధ్యవర్తుల ప్రమేయం, అక్రమాలకు తావు లేకుండా సేవలందించనున్నాం.

– శ్రీనివాసరావు, జిల్లా రిజిస్ట్రార్ స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్‌శాఖ

జాతర వేలం రూ.5.21 లక్షల ఆదాయం

పుంగనూరు: పట్టణంలో ఈనెల 14, 15న జరగనున్న శ్రీసుగుటూరు గంగమ్మ జాతర వేలంపాట బుధవారం సాయంత్రం జమీందారులు రాజాసోమశేఖర్ చిక్కరాయల్, రాజామల్లికార్జున చిక్కరాయల్ నిర్వహించారు. అమ్మవారి దర్శనం టికెట్లను రూ.2.71 లక్షలకు కేఎం మణి అనే వ్యాపారి వేలంపాటలో తీసుకున్నాడు. అలాగే పొట్టేళ్లు, దుకాణాల వేలంపాటలో మణికంఠ అనే వ్యాపారి రూ.2.50 లక్షలకు దక్కించుకున్నాడు. జాతర ద్వారా ఈసారి రూ.5.21 లక్షల ఆదాయం వచ్చింది.

పకడ్బందీగా ఏర్పాట్లు

జాతర పకడ్బందీగా నిర్వహిస్తామని పలమనేరు డీఎస్పీ సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఆయన కమిషనర్ నరసింహప్రసాద్‌రెడ్డి, సీఐ మధుసూదన్‌రెడ్డితో కలసి ప్యాలెస్‌ను పరిశీలించారు. అలాగే భద్రత, ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై దృష్టి పెడతామన్నారు.

మహిళలకు స్వీట్లు, దుస్తుల పంపిణీ



మహిళలకు స్వీట్లు పంచిపెడుతున్న అవుట్ సోర్సింగ్ అసోసియేషన్ సభ్యులు

చిత్తూరు అర్బన్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని చిత్తూరు నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ విభాగం, నీటి సరఫరా విభాగంలో పనిచేస్తున్న మహిళలకు బుధవారం అవుట్ సోర్సింగ్ అసోసియేషన్ సభ్యులు దుస్తులు, స్వీట్లు పంచిపెట్టారు. పలువురిని సన్మానించారు. కమిషనర్ అరుణను కలిసి మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సునీల్‌కుమార్, వెంకటేష్, పిరుల్ల, కృష్ణ, లక్ష్మి, చంద్రకళ, రాణి, శర్తాజ్, ప్రేమకుమారి, నళిని తదితరులు పాల్గొన్నారు.

గరుడవాహనంపై వెంకన్న చిద్విలాసం

వెదురుకుప్పం: మండలంలోని చిన్నకొమరగుంటలో ఉన్న పద్మావతీ ఆండాల్ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న వార్షికోత్సవంలో భాగంగా బుధవారం స్వామివారు గరుడ వాహనంపై విహరించారు. ఆలయంలో వేకువజామున స్వామి వారి మూలవిరాట్‌కు అర్చనలు, అభిషేకాలు చేశారు. అనంతరం ఉత్సవమూర్తులకు పాలు, పెరుగు, పసుపు, చందన, నారికేళ జలాలతో తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం స్వామివారికి విశేషాలంకరణ చేసి, గరుడ వాహనంపై కొలువు దీర్చి మంగళవాయిద్యాల నడుమ పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు ఇంటింటా కర్పూర హారతులిచ్చి, మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పలువురు పాల్గొన్నారు.

క్యాన్సర్ వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్యశిబిరాన్ని మహిళలతో కలిసి ప్రారంభిస్తున్న అడిషనల్ ఎస్పీ జగదీష్

చిత్తూరు అర్బన్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని ఏఆర్ మైదానంలో బుధవారం క్యాన్సర్ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని అడిషనల్ ఎస్పీ జగదీష్ ప్రారంభించారు. ఈ హెల్త్ క్యాంపు టాటా ట్రస్ట్ కాన్సర్ హాస్పిటల్ వారి సౌజన్యంతో పింక్ బస్సులో క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేశారు. మెమోగ్రఫీ, అల్ట్రాసౌండ్, పాప్స్మియర్, సాధారణ పరీక్షలు, మధుమేహ, లివర్, జాండీస్ పరీక్షలు చేయగా, పోలీసు కుటుంబ సభ్యులు, మహిళా ఉద్యోగులు 100మంది శిబిరాన్ని సద్వినియోగం చేసుకున్నారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ మేనేజర్ హేమంత్ కుమార్, డెంటల్ డాక్టర్ భార్గవ్, ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ రెడ్డి కుమారి, మామో టెక్నీషియన్ చైతన్య, పోలీసు వెల్ఫేర్ డాక్టర్ లావణ్య, ఏ.ఆర్.అడిషనల్ ఎస్పీ జి.నాగేశ్వరరావు, డీఎస్పీ శ్రీనివాస మూర్తి, దిశా డీఎస్పీ బాబు ప్రసాద్, ట్రాఫిక్ డీఎస్పీ తిప్పేస్వామి తదితరులు పాల్గొన్నారు.

మహిళా సమస్యలపై వెబ్‌సైట్



వెబ్‌సైట్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

చిత్తూరు కార్పొరేషన్: చిత్తూరుకు చెందిన హేమవిజయ్ మహిళా దినోత్సవం సందర్భంగా www.weheardyou.in అనే వెబ్‌సైటును ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు చేతుల మీదుగా ఆయన నివాసంలో ప్రారంభించారు. మహిళల భద్రత కోసం దీన్ని ప్రారంభించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. దీన్ని వినియోగించుకోవాలన్నారు. మహిళలు నలుగురితో చెప్పుకోలేని కులదూషణ, వరకట్న వేధింపులు, ఇతర కుటుంబ సమస్యలు ఈ వెబ్‌సైటు ద్వారా తెలియజేవచ్చని నిర్వాహకురాలు హేమవిజయ్ తెలిపారు. అందుకు సంబంధించి తీసుకోవలసిన చర్యలు, సలహాలను విశ్రాంత పోలీసులు, న్యాయవాదులు, సామాజిక కార్యకర్తల ద్వారా బాధితులకు అందుతాయని చెప్పారు. కార్యక్రమంలో శైలప్రసాద్, శాంతి, పాల్, రుతూ, విక్టోరియా తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతకు పెద్దపీట



చిత్తూరు: కేక్‌కట్ చేస్తున్న మేయర్ అముద, ఎమ్మెల్యే సతీమణి సత్యవతి



తవణంపల్లె: అరగొండ అపోలో నర్సింగ్ కళాశాలలో...



చిత్తూరు: కేక్ కట్ చేస్తున్న మహిళా పోలీసులు



టీచర్లను సన్మానిస్తున్న జనవిజ్ఞాన వేదిక సభ్యులు

చిత్తూరు కార్పొరేషన్: జగనన్న ప్రభుత్వం మహిళ సాధికారతకు పెద్దపీట వేసిందని నగర మేయర్ అముద తెలిపారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బుధవారం మహిళ దినోత్సవాన్ని ఆ పార్టీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు లీనారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. మేయర్ అముద, ఎమ్మెల్యే సతీమణి సత్యవతి, జెడ్పీ వైస్ చైర్మన్ రమ్య, లీనారెడ్డి కేక్‌కట్ చేసి మహిళా కార్పొరేటర్లకు, మహిళా కార్యకర్తలకు అందజేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మహిళలకు 50 శాతం రిజర్వేషన్ పదవుల్లో కల్పించిందని గుర్తుచేశారు. కార్యక్రమంలో నగర మహిళ అధ్యక్షురాలు, కార్పొరేటర్ భాగ్యలక్ష్మి రెడ్డి, కార్పొరేటర్లు హరిణిరెడ్డి, శోభ, సునీత, స్వరూప, షర్మిల, ఎంపీటీసీ ప్రతిమారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

తవణంపల్లె: మహిళలు విద్యావంతులై అన్ని రంగాల్లో రాణించాలని అరగొండ అపోలో నర్సింగ్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ లోకేశ్వరి తెలిపారు. మండలంలోని కళాశాలలో బుధవారం సిబ్బంది, విద్యార్థులు మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని సూచించారు. విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో జాతీయ సేవా పథకం అధికారి శోభారాణి, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

దిశ పోలీస్‌స్టేషన్‌లో...

చిత్తూరు అర్బన్ : నగరంలోని దిశ పోలీస్ స్టేషన్‌లో బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి అడిషనల్ ఎస్పీ జగదీష్ ముఖ్య అతిథిగా హాజరై మహిళా పోలీసులతో కేక్ కట్ చేయించారు. స్వీట్లు పంచిపెట్టారు. వారి సేవలను అభినందించారు. కార్యక్రమంలో దిశ డీఎస్పీ బాబు ప్రసాద్ పాల్గొన్నారు.

మహిళాభ్యుదయానికి ప్రభుత్వం కృషి

చిత్తూరు రూరల్: మహిళభ్యుదయానికి ప్రభుత్వం కృషి చేస్తోందని జిల్లా క్షయ నివారణ అధికారి రవిరాజు అన్నారు. నగరంలోని ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలోని జిల్లా క్షయ నివారణ కార్యాలయంలో బుధవారం మహిళా దినోత్సవం సందర్భంగా కేక్ కట్‌చేసి పంచిపెట్టారు. అనంతరం ఆయన మహిళా ఉద్యోగులు, సిబ్బందిని సన్మానించారు. కార్యక్రమంలో అధికారులు రవికుమార్ పాల్గొన్నారు.

మహిళాభ్యున్నతితోనే దేశ ప్రగతి

బంగారుపాళెం: మహిళాభ్యున్నతితోనే దేశ ప్రగతి సాధ్యమని స్టేట్‌బ్యాంక్ మేనేజర్ రామారావు అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మహిళా దినోత్సవంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. మహిళా శక్తి అద్వితీయమన్నారు. ఏపీఎం మీరాబాయి మాట్లాడుతూ, మహిళలపై అఘాయిత్యాలను నిర్మూలించినప్పుడే మహిళలకు నిజమైన స్వేచ్ఛ అని అన్నారు. ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఏరియా కో–ఆర్డినేటర్ హరినాథ్, సీసీలు పాల్గొన్నారు.

మహిళలకు సన్మానం

చిత్తూరు కలెక్టరేట్ : నగరంలోని ఎన్‌జీవో అతిథి గృహంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షులు రాఘవులు ఆధ్వర్యంలో, మిట్టూరులోని విజయం డిగ్రీ కళాశాలలో జనవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో బుధవారం మహిళా దినోత్సవం నిర్వహించారు. ఎస్సీ వెల్ఫేర్ డీడీ రాజ్యలక్ష్మి, సీపీవో జేడీ ఉమాదేవి, ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ పద్మజ, డీఆర్‌డీఏ పీడీ తులసి హాజరై ప్రసంగించారు. అనంతరం పలు పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. పలువురు మహిళలను దుశ్శాలువతో సన్మానించారు.

12న బ్రాహ్మణ వివాహ పరిచయ వేదిక

పుంగనూరు: బ్రాహ్మణ వధూవరుల పరిచయ వేదిక కార్యక్రమం ఈనెల 12న తిరుపతిలోని బైరాగిపట్టెడలో ఉన్న ఆశ్రమ కల్యాణ మండపంలో జరుపుతున్నట్లు బ్రాహ్మణ సంఘ కార్యదర్శి రామ్మూర్తి తెలిపారు. బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తిరుపతిలోని బీమాస్ బాలాజీ, కొత్తపల్లె అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో పరిచయ వేదిక జరుగుతోందన్నారు. వధూవరులు తమ పేర్లను నమోదు చేసుకుని, పరిచయ వేదికకు హాజరు కావాలన్నారు. వివరాలకు 9390427018, 6302136315 నంబర్లలో సంప్రదించాలని కోరారు. సమావేశంలో సంఘ నాయకులు మధుకుమార్ శర్మ, రామకృష్ణశర్మ, అశ్వర్థనారాయణ, కృష్ణమూర్తిరావు పాల్గొన్నారు.

ముమ్మరంగా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం



చిత్తూరులో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు



రాగిమానుపెంటలో ప్రచారం



ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రచారం చేస్తున్న ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి

చిత్తూరు కార్పొరేషన్: నగరంలోని పలు ప్రాంతాల్లో బుధవారం ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారాన్ని వైఎస్సార్‌సీపీ నాయకులు ఎమ్మెల్యేతో కలిసి ముమ్మరంగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ బలపరచిన పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డికి ఓట్లు వేసి గెలిపించాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అభ్యర్థించారు. మొదటి ప్రాధాన్యత ఓటును ఆయనకు వేయాలని కోరారు. చిత్తూరు నియోజకవర్గంలో 12 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారన్నారు. అనంతరం కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో మేయర్ అముద, ఏఎంసీ చైర్మన్ రాహుల్‌రెడ్డి సచివాలయ కన్వీనర్ల నగర ఇన్‌చార్జి కిరణ్, కార్పొరేటర్లు శశి, నజీరా, కుప్పమ్మ, గణేష్, కో–ఆప్షన్ సభ్యులు ఆను, నాయకులు అల్తాఫ్, వినాయకబాలాజీ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీగా పేర్నాటిని గెలిపించండి

బంగారుపాళెం: వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ మండలంలో నాయకులు ముమ్మరంగా ప్రచారం సాగించారు. మండల పార్టీ కన్వీనర్ రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని టేకుమంద, కీరమంద, కొదలమడుగు, రాగిమానుపెంట, వెలుతురుచేను పంచాయతీల పరిధిలో పట్టభద్రుల ఓటరు ఇళ్లకు వెళ్లి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అమరావతి, జెడ్పీ మాజీ చైర్మన్ కుమార్‌రాజా, జెడ్పీటీసీ సోమశేఖర్, సింగిల్ విండో, ఏఎంసీ చైర్మన్లు దత్తాత్రేయరెడ్డి, నారేసోమశేఖర్, కురబ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ అమరనాథ్, వైఎస్సార్‌సీపీ జిల్లా యూత్ ఉపాధ్యక్షుడు మహేంద్ర, బీసీ నాయకుడు దొరస్వామి, సర్పంచులు, రత్నయ్య, రాజా, మాలతి. శ్రీహరి, సుబ్రమణ్యం, మీడియా కో కన్వీనర్ రెడ్డెప్ప, మాజీ సర్పంచ్ గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులకు మద్దతు

గుడిపాల: వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులు పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డిని అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరుతూ బుధవారం ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి ప్రచారం నిర్వహించారు. వసంతాపురం పంచాయతీలో ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు ఉన్న ప్రతి ఇంటికీ వెళ్లి ప్రచారం నిర్వహించి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ఆయనతో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు రజినీకాంత్, సాయి, శింభు, వెంకటేష్‌రెడ్డి, రెడ్డప్ప, సురేంద్రారెడ్డి ప్రచారం చేశారు.